ఊరంతా కన్నీటి సుడులు

- కదిలొచ్చిన జిల్లా యంత్రాంగం
- యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు
- మంత్రి కాకాణి దగ్గరుండి పర్యవేక్షణ
- అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష



కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావుతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి, పక్కన జెడ్పీచైర్‌పర్సన్ అరుణమ్మ

పొదలకూరు : మండలంలోని తోడేరుకు చెందిన ఆరుగురు యువకులు పడవ బోల్తాలో గల్లంతై మృతి చెందడంతో ఊరంతా కన్నీటి సుడులు తిరుగుతున్నాయి. ఆదివారం పది యువకులు పడవలో చెరువులోకి వెళ్లి గల్లంతైన ఆరుగురి కోసం జిల్లా అధికార యంత్రాంగం రాత్రి నుంచే గాలింపు చర్యలు చేపట్టింది. మంత్రి కాకాణి స్వగ్రామం కావడంతో స్వయంగా ఆయనే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు దగ్గరుండి పర్యవేక్షించారు. అప్పటికే ముత్తుకూరు నుంచి ప్రత్యేకంగా మరబోట్లను తెప్పించారు. ముందుగా ఎస్పీ విజయారావు చెరువు వద్దకు చేరుకోగా తర్వాత కలెక్టర్ చక్రధర్‌బాబు వచ్చారు. పోలీసులు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్షించారు. గజఈతగాళ్లు ఉదయం 11 గంటలకు ఐదుగురు యువకుల మృతదేహాలను వెలికితీసి ఒడ్డుకు చేర్చారు. ఆరో మృతదేహం సాయంత్రం 5.30 గంటల వరకు లభ్యం కాకపోవడంతో గాలింపు ముమ్మరం చేయడం వల్ల ఎట్టకేలకు సురేంద్ర మృతదేహం లభ్యమైంది. నెల్లూరు ఆర్డీఓ మలోల, జెడ్పీ సీఈఓ చిరంజీవి, జిల్లా ఫైర్‌అధికారి శ్రీకాంత్, నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, పొదలకూరు, కోవూరు, వెంకటాచలం సీఐలు సంగమేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, గంగాధరరావు, ముత్తుకూరు, పొదలకూరు ఎస్సైలు శివ, అంజిరెడ్డి, కరిముల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, రాజకీయ నాయకులు కొత్తచెరువు వద్దకు చేరుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయరెడ్డి తదితరులు హాజరయ్యారు.

చెరువుకు సమీపంలోనే పోస్టుమార్టమ్

ఒక్కసారిగా పడవ ప్రమాదంలో ఆరుగురు యువకులు మృతి చెందడంతో ఒడ్డుకు చేర్చిన మృతదేహాలకు చెరువుకు సమీపంలోనే ఫోరెన్సిక్ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో పోస్టుమార్టమ్ నిర్వహించి మృతదేహాలను బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. పొదలకూరు సీఐ జి.సంగమేశ్వరరావు ముందుగా మెన్‌మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తర్వాత దర్యాప్తులో మృతికి గల కారణాలను తెలుసుకుంటామన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి సాయం

మృతుల కుటుంబాలకు ప్రాథమికంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మధ్యాహ్నం తోడేరుకు చేరుకున్న మంత్రి యువకుల భౌతికకాయాలను సందర్శించి నివాళులర్పించారు. తల్లిదండ్రులను ఓదార్చి అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకారం అందించారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

పొదలకూరు : పడవ బోల్తా ఘటనలో మృతి చెందిన తోడేరు గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితుల అత్యక్రియలు అశ్రునయనాల మధ్య నిర్వహించారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి దగ్గరుండి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయించారు. ఆయా కుటుంబాల సంప్రదాయాల ప్రకారం వేర్వేరుగా అంత్యక్రియలను నిర్వహించినప్పటికీ స్మశానంలో మాత్రం పక్క పక్కనే ఖననం చేశారు.



యువకుని భౌతికకాయం వద్ద నివాళులర్పించి సాయం అందజేస్తున్న మంత్రి కాకాణి



మృతుల కుటుంబాన్ని ఓదార్చుతున్న మంత్రి



చెరువు వద్ద గుమిగూడిన జనాలు

బాధితులకు ఆపన్న హస్తం



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఐదుగురికి సాయం

కోవూరు : వివిధ కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆపన్న హస్తం అందించారు. అందుకు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం ఆయన నివాసంలో ఐదుగురు చిన్నారులకు అందజేశారు. బాండ్లు అందుకున్న వారిలో వేగూరు గ్రామానికి చెందిన గున్నం శ్రీనివాసులు, గున్నం నాగలక్ష్మి, పూడి దివ్య, పూడి వెంకటపవిత్రలకు రూ.20 వేల చొప్పున మొత్తం రూ.80 వేల సాయం చేశారు. అదే విధంగా పడుగుపాడు దళితవాడకు చెందిన కోవూరు సాల్మన్‌కు రూ.25 వేల సాయం అందించారు. వీటికి సంబంధించిన నగదును పడుగుపాడు సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీసీఏబీ చైర్మన్ నిరంజన్ బాబురెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, చంద్ర పాల్గొన్నారు.

కమీషన్ విషయమై వివాదం

- బీరు బాటిల్‌తో పరస్పరం దాడి, గాయాలు



చికిత్స పొందుతున్న ఖాదర్‌బాషా



చికిత్స పొందుతున్న సాహుల్

కొడవలూరు : బైక్ అమ్మకంలో కమీషన్ విషయమై ఇద్దరు స్నేహితుల మధ్య వివాదం చోటుచేసుకుని పరస్పరం బీరు బాటిల్‌తో దాడికి దిగడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని యల్లాయపాళెం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌కు చెందిన ఖాదర్‌బాషా, సాహుల్ స్నేహితులు. సాహుల్‌కు చెందిన హోండా ఎక్స్‌ట్రీమ్ బైక్‌ను ఖాదర్‌బాషా నార్తురాజుపాళేనికి చెందిన వ్యక్తికి రూ.6,500 లకు అమ్మించారు. దీనికి గాను కమీషన్ కింద రూ.500 ఇవ్వాలని ఖాదర్‌బాషా, సాహుల్‌ను కోరారు. అందుకు అతను తిరస్కరించడంతో ఇరువురి మధ్య వివాదం చోటుచేసుకుంది. అప్పటికే ఇద్దరూ మద్యం మత్తులో ఉండడంతో మాటామాటా పెరిగి బీరు బాటిల్‌తో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఖాదర్‌బాషాకు మెడపై గాయమవ్వగా, సాహుల్‌కు చేతులు, ఒంటిపై గాయాలయ్యాయి. వీరిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్బారావు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



ఇందుకూరుపేట : పెరట కోళ్లను అందజేస్తున్న ఏడీ మురళీకృష్ణ



కొడవలూరు : పెరటి కోళ్లతో లబ్ధిదారులు

ఇందుకూరుపేట : మహిళలు ఆర్థికంగా రాణించి కుటుంబానికి చేదోడుగా నిలవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ఏపీఎం రవిశంకర్ ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు పెరటికోళ్ల యూనిట్లను సోమవారం అందజేశారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి వంద యూనిట్లు మంజూరు చేసినట్లు తెలియజేశారు. యూనిట్‌కు పది పెరటికోళ్లతో పాటు బస్తా మేత, మందులను అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ముదివర్తిపాళెం పశువైద్యాధికారి డాక్టర్ హరిబాబు, ఎల్ఎస్ఏ రవికుమార్, ఏహెచ్ఏ జగదీష్, వీఏఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి మెరుగు

కొడవలూరు : పెరటి కోళ్ల పెంపకంతో జీవనోపాధి మెరుగు పరుచుకోవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు 120 యూనిట్ల పెరటి కోళ్లను సోమవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ రూ.3,500లకే పది కోళ్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ఒక్క యూనిట్‌లో ఆరు పెట్టలు, నాలుగు పుంజులు ఉంటాయన్నారు. వీటిని పెంచుకోవడం ద్వారా గుడ్లు, పిల్లలను విక్రయించుకుని లాభపడడంతో పాటు మంచి పోషకాహారం తీసుకోవచ్చన్నారు. గుడ్లు, మాంసం తీసుకోవడం వల్ల పోషక విలువలు పెంపొందుతాయన్నారు. కోళ్లతో పాటు పది కిలోల కోళ్ల మేత, మందులు కూడా పంపిణీ చేస్తున్నందున కోళ్లు మృత్యువాత పడుతాయన్న భయం లేకుండా పెంచుకోవచ్చని సూచించారు. పెరటి కోళ్ల పెంపకం చేపట్టిన వారంతా లాభపడుతున్నట్లు నిర్ధారణ కావడంతో మహిళా సంఘాలకు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జె.సురేష్‌బాబు, సీసీలు కె.ఉదయ్‌కుమార్, మమత, శోభ, శ్రీదేవి, వీఓఏలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని అలగానిపాడులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిర ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా కలశ స్థాపనను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత పుట్టమట్టిని తీసుకొచ్చి ప్రతిష్ఠ మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం కలశ స్థాపన, నివేదన, మంత్ర పుష్పం కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆకురాతి శ్రీనివాసులు-నాగజ్యోతి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆశ్రమ భూములను కాపాడండి



మాట్లాడుతున్న ఆశ్రమ వృద్ధులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని పొన్నపూడి గ్రామంలో ఉన్న శ్రీకృష్ణమఠం ఆశ్రమ భూములను కాపాడాలని ఆశ్రమంలోని వృద్ధులు కోరారు. ఈ మేరకు పొన్నపూడిలో సోమవారం వారు మాట్లాడారు. పొన్నపూడిలో దాదాపు 80 సంవత్సరాల క్రితం మఠం ఏర్పడిందని, దానికి అనుసంధానంగా 30 సంవత్సరాల నుంచి ఆశ్రమం ఉందన్నారు. ఇందులో దాదాపు వంద మంది వృద్ధులు, సాధువులు ఉంటారని తెలిపారు. మఠంకు చెందిన భూములను ఓ మహిళ సర్వే నంబర్ మార్చి తమకు నోటీసులు పంపుతోందని, దీనిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రామలింగయ్య, చిన్నారెడ్డి, తిరుపాలు, నరసయ్య, రాము, రోశయ్య, సుధాకర్, జయరామయ్య పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఎమ్మెల్యే ప్రసన్నకు మొక్కను అందజేస్తున్న సూరా శ్రీనివాసులురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన సూరా శ్రీనివాసులురెడ్డి సోమవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎమ్మెల్యే ప్రసన్న రెండోసారి తనను రైతు విభాగ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయన వెంట రాష్ట్ర డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఇందుకూరుపేట మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

రూ.40 లక్షలతో తాళ్లపూడికి సీసీరోడ్డు



తాళ్లపూడికి నిర్మిస్తున్న సీసీరోడ్డు

ముత్తుకూరు : ముత్తుకూరు ప్రధాన రోడ్డు నుంచి తాళ్లపూడి సాయిబాబా మందిరం వరకు రూ.40 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పీఆర్(ప్రాజెక్టు) శాఖ ఆధ్వర్యంలో సుమారు 390 మీటర్ల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎంపీ విజయసాయిరెడ్డి సహకారంతో రోడ్డు నిర్మాణం జరుగుతోంది. రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి స్వగ్రామమైన తాళ్లపూడికి సరికొత్త అందాలను సంతరించుకోవడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని ఐదో వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సోమవారం వైస్ చైర్‌పర్సన్ షేక్.షాహుల్ జగనన్న గోరుముద్ద పథకం కింద అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటించినప్పుడు ఈ పాఠశాలలో భోజనం బాగాలేదని విద్యార్థులు చెప్పినట్లు తెలిపారు. ఇందులో భాగంగా తాను కూడా భోజనాన్ని పరిశీలించినట్లు వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు.

కలుపు నివారణపై అవగాహన అవసరం

- దశల వారీగా మందులు వాడితే నివారణ సాధ్యం
- ఐఐఆర్‌సీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి



గండవరంలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీదేవి

కొడవలూరు : కలుపు నివారణపై రైతుల్లో అవగాహన అవసరమని ఐఐఆర్‌సీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్) హైదరాబాద్ ముఖ్య శాస్త్రవేత్త బి.శ్రీదేవి సూచించారు. మండలంలోని గండవరంలో వెదజల్లే పద్ధతిలో నార్లు పోసి సాగు చేస్తున్న వరి పంటను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడి వరి పంటలో కలుపు నివారించ లేకపోవడాన్ని గుర్తించి పలు సూచనలు చేశారు. విత్తనం వెదజల్లే పద్ధతిలో కలుపు సమస్య అధికంగా ఉంటుందన్నారు. పంట దశలను అనుసరించి మందులు వాడడం ద్వారా కలుపు నివారించుకోవచ్చన్నారు. ఏ దశలో ఏ రకం కలుపు నివారణ మందు వినియోగించాలో రైతుల్లో అవగాహన లేకపోవడం వల్లే కలుపును నివారించుకోలేకపోతున్నారని చెప్పారు. వివిధ రకాల కలుపు నివారణ మందులను కలిపి ఒకేసారి వినియోగిస్తున్నందున నివారణ సాధ్యం కావడం లేదన్నారు. వెదజల్లే పద్ధతిలో విత్తనం చల్లిన వారం లోపే కలుపు నివారణ మందును విధిగా స్ప్రే చేయాలని చెప్పారు. తరువాత 15–20 రోజుల మధ్యలో మరోసారి మందు స్ప్రే చేయాలన్నారు. ఇలా దశలను బట్టి మందులు వాడడం ద్వారా తప్పక కలుపును నివారించుకోవచ్చన్నారు. పంట మూడు ఆకులున్న దశలోనే కలుపు నివారించాలన్నారు. అంతకంటే ఎక్కువ ఆకులు వచ్చాక మందులు వినియోగించినప్పటికీ నివారణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఆమె వెంట నెల్లూరు ఏఆర్ఎస్ ముఖ్య శాస్త్రవేత్త యు.వినీత, డీఆర్‌సీ ఏడీఏ సి.మారుతిదేవి, కోవూరు ఏడీఏ డి.సుజాత, ఏఓ సీహెచ్ఎస్.లక్ష్మి, వీఏఏలు కవిత, శ్రావ్య, రైతులు సి.బాబులురెడ్డి, సీహెచ్.దేవకుమార్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



రామకృష్ణ కుటుంసభ్యులకు నగదు అందజేస్తున్న సంఘ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు మాడా రామకృష్ణ ఇటీవల కల్లుగీస్తూ చెట్టుమీద నుంచి జారి పడి మృతిచెందగా ఆయన కుటుంబానికి కల్లుగీత పారిశ్రామిక సంఘం, గౌడ్ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20 వేలతో పాటు సంఘ అధ్యక్షుడు తాతా రమణయ్య మరో రూ.5 వేలను సోమవారం అందజేశారు. విడవలూరుకు చెందిన దాసరి వీరయ్య చెట్టు మీద నుంచి జారి పడి అనారోగ్యం పాలవడంతో ఆయనకు ట్రస్టు ద్వారా రూ.10 వేలను అందచేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు ముత్యాలయ్య, రాజశేఖర్, ప్రభాకర్, రంగయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, చిన్న గోవిందయ్య, మల్లికార్జున్, శీనయ్య, రంగయ్య, నారాయణ, వెంకయ్య, పుల్లయ్య, గన్నయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ-పంట నమోదుకు నేటితో గడువు



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

తోటపల్లిగూడూరు : ఈ-పంట నమోదు గడువు 28వ తేదీతో(నేడు) ముగుస్తుందని ఇందుకూరుపేట డివిజన్ ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. నరుకూరు రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ-పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకుంటే ప్రభుత్వ పరమైన ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల ఏఓ గీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గురివిందపూడిలో రీసర్వే



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న అధికారులు

మనుబోలు : మండలంలోని గురివిందపూడి గ్రామంలో భూముల రీసర్వేను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేయర్ వంశీకృష్ణ మాట్లాడుతూ డ్రోన్ సర్వేతో ఖచ్చితమైన కొలతలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మన్నెమాల సుధీర్ రెడ్డి ఎం.శ్రీహరిరెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. గూడూరు పట్టణానికి చెందిన నవీన్‌కుమార్, మురళి పనినిమిత్తం కృష్ణపట్నం వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో గేదెలు అడ్డురావడంతో మోటారు బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడగా చికిత్స నిమిత్తం వారిని నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేత

ముత్తుకూరు : మండలంలోని దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో 1, 3 యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ఇంజినీర్లు సోమవారం తెలిపారు. 1వ యూనిట్లో 360 మెగావాట్లు, 3వ యూనిట్లో 465 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 2వ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశారు.

లారీ బోల్తా

- ఒకరికి గాయాలు



బోల్తా పడిన లారీ

ఇందుకూరుపేట : మండల పరిధిలోని ఆరో మైలు కూడలి వద్ద సోమవారం రాత్రి ఓ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గాయాలపాలవగా, మరో ఆరుగురు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. నరుకూరు వైపు నుంచి నెల్లూరుకు వెళ్లే క్రమంలో ఆరో మైలు వద్ద ఉన్న తాత్కాలిక వంతెన వద్ద ప్రమాదం జరిగింది. దీంతో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం కలిగింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ముగిసిన 'మిస్ సింహపురి' గ్రాండ్ ఆడిషన్స్



ఆడిషన్స్‌కు హాజరైన యువతులతో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న హోటల్ తేజశ్విని గ్రాండ్‌లో నిర్వహిస్తున్న 'మిస్ సింహపురి' గ్రాండ్ ఆడిషన్స్ సోమవారంతో ముగిశాయి. విశాఖపట్నానికి చెందిన స్టార్ ఈవెంట్స్ రాజు ఆధ్వర్యంలో 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి సహకారంతో ఆది, సోమవారాల్లో నిర్వహించిన ఆడిషన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50మందికి పైగా యువతులు హాజరయ్యారు. ఆడిషన్స్‌కు హాజరైన యువతులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ యువతుల్లో సమాజంపై అవగాహన కల్పించడంతో పాటు మనోస్థైర్యాన్ని పెంపొందించేందుకు పోటీలు దోహదపడుతాయన్నారు. సత్యంజీ, ఏ సునీత, రిచ్‌గోల్డ్ సురేష్, వైద్యులు దుర్గా అఖిల్, తేజ, శ్రీనివాస్, ఫ్యాషన్ డిజైనర్ రవళి, 25 కళాసంఘాల కన్వీనర్లు డీ హరిబాబు, అమీర్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - పొదలకూరు

ఆర్.సి.నెం.వేలములు/1/2021 బహిరంగ వేలం నోటీసు తేది 26-02-2023ది

శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరుజిల్లా, పొదలకూరు మండలం పొదలకూరు గ్రామ పంచాయతీకి చెందిన ఈ క్రింది వివరములకు తే.04-03-2023 శనివారం ఉదయం 10గంటలకు పొదలకూరు గ్రామ సచివాలయం టీటీ-1 కార్యాలయంలో వేలం నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు వేలం షరతులకు లోబడి పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వేలం వివరములు :-

క్ర.స	వేలం వివరము	కాలపరిమితి	చెల్లించవలసిన ధరావత్తు
1	2	3	4
1	పొదలకూరు గ్రామ చెరువులో చేపలు పట్టుకొను హక్కు	1432	1000/-

వేలం షరతులను కార్యాలయ పనివేళలలో తెలుసుకొనవచ్చును

సం/- షేక్ అల్లాబక్షు, పంచాయతీ కార్యదర్శి, పొదలకూరు గ్రామ పంచాయతీ

ఊటుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్.ఓ.సి.నెం.02/2023 టెండర్ ప్రకటన తేది: 27-02-2023

ఇందుమూలముగా విడవలూరు మండలం ఊటుకూరు గ్రామ పంచాయతీలో తేదీ 01-04-2023 నుండి తేదీ 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలం పరిమితితో ఈ క్రింది పోస్టులకు టెండర్లు దాఖలు పరచుకొనవచ్చును.

వ.	వివరములు	పోస్టులు	ధరావత్తు
1.	తాత్కాలిక స్వీపర్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	6	రూ.100/-
2.	తాత్కాలిక PWS ఆపరేటర్స్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	6	రూ.100/-
3	తాత్కాలిక ఎలక్ట్రీషియన్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	1	రూ.100/-

పై టెండర్లను తేది 10-03-2023 శుక్రవారం ఉదయం10.30 గంటలకు టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు సీల్డ్ టెండర్లు తెరువబడును. మిగతా విషయములు కార్యాలయం పనిచేస్తున్న సమయంలో తెలుకొనవచ్చును. ఏదైనా ప్రభుత్వసెలవు ప్రకటించిన ఎడల తదుపరి పని దినమునందు టెండర్లు స్వీకరించబడును.

సం/- ఐ. శ్రీనివాసమూర్తి, పంచాయతీ సెక్రటరీ, ఊటుకూరు గ్రామ పంచాయతీ.

వరిణి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్.ఓ.సి.నెం.02/2023 టెండర్ ప్రకటన తేది: 27-02-2023

ఇందుమూలముగా విడవలూరు మండలం వరిణి గ్రామ పంచాయతీలో తేదీ 01-04-2023 నుండి తేదీ 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలం పరిమితితో ఈ క్రింది పోస్టులకు టెండర్లు దాఖలు పరచుకొనవచ్చును.

వ.	వివరములు	పోస్టులు	ధరావత్తు
1.	తాత్కాలిక స్వీపర్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	2	రూ.100/-
2.	తాత్కాలిక PWS ఆపరేటర్స్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	2	రూ.100/-
3	తాత్కాలిక ఎలక్ట్రీషియన్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	1	రూ.100/-

పై టెండర్లను తేది 10-03-2023 శుక్రవారం ఉదయం10.30 గంటలకు టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు సీల్డ్ టెండర్లు తెరువబడును. మిగతా విషయములు కార్యాలయం పనిచేస్తున్న సమయంలో తెలుకొనవచ్చును. ఏదైనా ప్రభుత్వసెలవు ప్రకటించిన ఎడల తదుపరి పని దినమునందు టెండర్లు స్వీకరించబడును.

సం/-శ్రీమతి పి. సుకన్య, పంచాయతీ సెక్రటరీ, వరిణి గ్రామ పంచాయతీ.

అలగానిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్.ఓ.సి.నెం.02/2023 టెండర్ ప్రకటన తేది: 27-02-2023

ఇందుమూలముగా విడవలూరు మండలం అలగానిపాడు గ్రామ పంచాయతీలో తేదీ 01-04-2023 నుండి తేదీ 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలం పరిమితితో ఈ క్రింది పోస్టులకు టెండర్లు దాఖలు పరచుకొనవచ్చును.

వ.	వివరములు	పోస్టులు	ధరావత్తు
1.	తాత్కాలిక స్వీపర్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	2	రూ.100/-
2.	తాత్కాలిక PWS ఆపరేటర్స్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	2	రూ.100/-
3	తాత్కాలిక ఎలక్ట్రీషియన్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	1	రూ.100/-

పై టెండర్లను తేది 10-03-2023 శుక్రవారం ఉదయం10.30 గంటలకు టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు సీల్డ్ టెండర్లు తెరువబడును. మిగతా విషయములు కార్యాలయం పనిచేస్తున్న సమయంలో తెలుకొనవచ్చును. ఏదైనా ప్రభుత్వసెలవు ప్రకటించిన ఎడల తదుపరి పని దినమునందు టెండర్లు స్వీకరించబడును.

సం/- శ్రీమతి టి.రాధాకుమారి, పంచాయతీ కార్యదర్శి, అలగానిపాడు గ్రామ పంచాయతీ.